సాక్షి అనంతపురం

బుధవారం । 17 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.16 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16 వేలు, కనిష్టం రూ.7 వేలు పలికాయి.



'మెరిట్' లిస్ట్.. 'సెలక్షన్' ట్విస్ట్

డీఎస్సీ–2025 నియామక ప్రక్రియలో గందరగోళం నెలకొంది. ఒక కేటగిరిలో వెనకున్న అభ్యర్థులను అధికారులు ఎంపిక చేశారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం

35.2°/21.6°

జిల్లా అంతటా మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

తల్లడిల్లిన ఉల్లి రైతు



ఉల్లి పంటను దున్నేస్తున్న రైతు అనంతరెడ్డి

గుమ్మఘట్ట: ధర గిట్టుబాటు కాకపోవడంతో ఉల్లి పంటను రైతు దున్నేశాడు. జె.వెంకటంపల్లికి చెందిన రైతు అనంతరెడ్డి తనకున్న 2.5 ఎకరాల్లో రూ.2 లక్షల పెట్టుబడి పెట్టి ఉల్లి సాగు చేశాడు. ఆరుగాలం శ్రమించి చెమటోడ్చి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి బహిరంగ మార్కెట్‌లో ధరలు పడిపోయాయి. 60 కిలోల బస్తా రూ.200 మాత్రమే పలకడంతో ఇది ఏమాత్రమూ గిట్టుబాటు కాదని రైతు తన పంటను ట్రాక్టర్ రోటోవేటర్ సాయంతో దున్నేశాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని ఉల్లి రైతులు కోరుతున్నారు.

ఆ తల్లి నిర్ణయం.. ఆరుగురికి వరం

- ఒక్కగానొక్క కుమారుడి బ్రెయిన్‌డెడ్
- అవయవ దానానికి తల్లి అంగీకారం



నవీన్(ఫైల్)

చిలమత్తూరు: ఒక్కగానొక్క కుమారుడు. బిడ్డకు మూడు నెలల వయసులోనే భర్త మరణించాడు. అయినా కష్టాలకు ఎదురీది కుమారుణ్ని కంటికి రెప్పలా చూసుకుంది. ఇరవై ఏళ్లు నిండాయి. ఇంటికి పెద్ద దిక్కుగా నిలుస్తాడనుకుంది. అయితే విధి మరొకటి తలచింది. కుమారుడు రోడ్డు ప్రమాదానికి గురై బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. ఈ బాధ ఆ తల్లి గుండెను పిండేసింది. ఇంతటి దుఃఖంలోనూ కుమారుడి అవయవదానానికి అంగీకరించింది. వివరాల్లోకి వెళితే... చిలమత్తూరులో ఈ నెల 13న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మరణించగా, తుమ్మలకుంటకు చెందిన నవీన్‌తో పాటు మరొక యువకుడు తీవ్రంగా గాయపడ్డారు. నవీన్‌ను మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయ్యాడు. ఆసుపత్రి వర్గాలు నవీన్ తల్లి గీతతో మాట్లాడి కుమారుడి అవయవాలు దానం చేయాలని అభ్యర్థించారు. ఇందుకు ఆమె అంగీకరించింది. తన బిడ్డ భౌతికంగా దూరమైనా అవయవ దానంతో సజీవంగా ఉంటాడని భావించింది. గుండె, కళ్లు, లివర్, కిడ్నీలను దానం చేసింది. వాటిని వైద్యులు ఆరుగురికి అమర్చి పునర్జన్మ ప్రసాదించారు. ఈ విషయం తెలిసిన పలువురు గీతను ప్రశంసిస్తున్నారు.

కష్టాలు ఉచితం

- ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఓడీసీ (ఓబుళదేవర చెరువు) బస్టాప్‌లోకి వచ్చిన మహమూద్ బాషాకు 5 బస్సులు ఆపలేదు. చివరకు చచ్చీ చెడీ కదిరికి రావాల్సి వచ్చింది. మళ్లీ కదిరి నుంచి అనంతపురం రావడానికి 5 గంటల సమయం పట్టింది.
- బత్తలపల్లి – ముదిగుబ్బ మధ్యలో ఉండే రాళ్ల అనంతపురంలో ఐదుగురు మహిళలు సోమవారం బస్టాప్‌కు వస్తే వరుసగా వచ్చిన నాలుగు బస్సులు ఆపలేదు. మూడు గంటలు అక్కడే నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది.
- నాయనిపల్లి క్రాస్‌నుంచి రోజూ ఐదారుగురు ఉపాధ్యాయులు తాడిపత్రికి వెళతారు. అనంతపురం నుంచి బయలుదేరిన బస్సులు అప్పటికే ఫుల్ అయ్యాయని నాయనిపల్లి క్రాస్‌లో నిలపడం లేదు. దీంతో వాళ్లు స్కూలుకెళ్లడం గగనమవుతోంది.



అనంతపురం ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులో సీట్ల కోసం అగచాట్లు

ఉక్కిరి బిక్కిరి..

- ఆర్టీసీ సర్వీసులు తగ్గించిన అధికారులు
- ప్రయాణికులతో కిక్కిరిసిపోతున్న బస్సులు
- ఉచితమే కదా అని స్టాపుల్లో మహిళలున్నా ఆపని వైనం
- డబ్బులిచ్చి వెళదామన్నా తగినన్ని బస్సుల్లేవంటున్న పురుషులు
- బిక్కుబిక్కుమంటూనే ప్రయాణం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఆర్టీసీలో ఉచిత ప్రయాణం నరకం చూపిస్తోంది. వచ్చిన బస్సులు ఆగవు.. కొత్తవి రావు.. ఏం చేయాలో తెలియక ప్రయాణికులు గగ్గోలు పెడుతున్నారు. స్త్రీశక్తి పేరుతో ప్రారంభించిన ఈ సేవలు మహిళల సహనానికి పరీక్ష పెడుతున్నాయి. ఆర్టీసీ బస్టాండులలో మొదలయ్యే బస్సులు మండల కేంద్రాల్లోని బస్టాపుల్లో సైతం ఆపకపోవడం, ఉన్న బస్సులు తగ్గించడంతో జాప్యం వెరసి తమ సహనాన్ని సర్కారు పరీక్షిస్తోందని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మహిళలు వాపోతున్నారు. ఓవైపు మహిళల్ని చూస్తే బస్సులాగక పోగా.. డబ్బులిచ్చి బస్సెక్కుదామనే పురుషులకూ ఇప్పుడు బస్సుల్లేకపోవడంతో ఉద్యోగులు మొదలుకొని వృద్ధుల వరకు యాతన పడుతున్నారు.

ప్రయాణమంటే భయమేస్తోంది

'పది రూపాయలు ఖర్చయినా సరే ప్రశాంతంగా ప్రయాణం చేసి వచ్చేవాళ్లం.. ఇప్పుడు 'నరకం' చూస్తున్నాం' అంటున్నారు ప్రయాణికులు. ఉమ్మడి జిల్లాలో మహిళలు ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారని బస్సులు తగ్గించారు. ముందు స్టాపులో ఫుల్ అయిందని రెండు, మూడు, నాలుగవ స్టాపుల్లో ఆపడం లేదు. అంతర్రాష్ట్ర సర్వీసుల్లో అనుమతి లేదు. సూపర్ లగ్జరీ ఎక్కడానికి లేదు. ఒక్కోసారి అనంతపురం బస్టాండులోనే బస్సు ఫుల్ అయితే గమ్యస్థానం వరకూ ఆపడం లేదు. మధ్యలో వేచి చూసే ప్రయాణికుల సంగతి పట్టించుకోవడం లేదు.

ఉద్యోగులకు నరకం

ఉద్యోగులు రోజూ అనంతపురం నుంచి ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రి, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి ఇలా పలు చోట్లకు ప్రయాణం చేస్తూ సాయంత్రం ఇంటికొస్తారు. గతంలో ఉదయం 7:30కి బస్సెక్కితే స్కూలు లేదా ఆఫీసు సమయానికి చేరుకునేవారు. కానీ ఇప్పుడు బస్సులు లేక, ఉన్న బస్సుల్లో నిల్చునేందుకు కూడా చోటులేక అల్లాడుతున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు అయితే డబ్బులిచ్చి వెళదామన్నా బస్సుల్లేవని వాపోతున్నారు. అనంతపురం డిపో నుంచి బయలుదేరే బస్సు ఎక్కితేనే ప్రయాణం.. లేదంటే మధ్యలో బస్సు ఆగుతుందనుకుంటే బొక్కబోర్లా పడ్డట్టేనని వాపోతున్నారు.



బస్సు ఎక్కుతున్న మహిళా ప్రయాణికులు

అనంతపురం జిల్లాలో ఆర్టీసీ సేవలు	
జిల్లా జనాభా	24.90 లక్షలు
మహిళల జనాభా	13.40 లక్షల పైనే
జిల్లాలో గ్రామాలు	1,131
మొత్తం ఆర్టీసీ డిపోలు	07
డిపోల్లో ఉన్న బస్సులు	512
బస్సు సర్వీసులున్న గ్రామాలు	453
కొత్తగా నడపాల్సిన సర్వీసులు	65

గంట వేచి ఉన్నా సీటు దొరకలేదు



నేను నా కొడుకుతో కలిసి అనంతపురం వెళ్లేందుకు కళ్యాణదుర్గంలోని టీ సర్కిల్ సమీపంలోని సిటీ ప్యాలెస్ దగ్గరికి వచ్చాను. గంట సేపు వేచి ఉన్నా వచ్చిన బస్సులన్నీ బస్టాండ్ నుంచే జనాలతో కిక్కిరిసి వచ్చాయి. ఎక్కుదామంటే కండక్టర్లు 'వెనుక ఖాళీ బస్సు వస్తుంది చూడమ్మా' అంటున్నారు. ఇలా నాలుగైదు బస్సులు పోయాయి. ప్రభుత్వమేమో ఫ్రీ బస్సు అని చెప్పింది. కానీ దానికి అనుగుణంగా బస్సుల సంఖ్య కూడా పెంచితే మేలు.

– లలితమ్మ, ప్రయాణికురాలు, కళ్యాణదుర్గం

ఇలా అయితే ప్రయాణమెలా..?



నేను కుందుర్పి నుంచి కళ్యాణదుర్గం వెళ్దామని ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు బస్టాండ్‌కు వచ్చాను. బస్సు రాగానే జనాలు ఎగబడ్డారు. నేను ఎక్కుతున్న సమయంలోనే కండక్టరు 'సీట్లు లేవు వెనుక బస్సుకు రండి' అని చెప్పారు. అసలే బస్సు సర్వీసులు తక్కువగా ఉంటున్నాయి. ఇలాగైతే ప్రయాణాలు ఎలా చేయాలి?

– కవిత, తూముకుంట, కుందుర్పి మండలం

బస్సులు ఆపడం లేదు



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అని ప్రకటించినప్పటి నుంచి మహిళలను చూస్తే బస్సులు ఆపడంలేదు. బస్ స్టాప్‌లోకి వచ్చి బస్సులు ఎక్కాలని, ఎక్కడంటే అక్కడ ఆపేది లేదని డ్రైవర్లు, కండక్టర్లు కరాఖండిగా చెబుతున్నారు. చంటి పిల్లలతో ఆడవారు కనిపించినా ఆపడం లేదు. ఇది వరకు ఎక్కడ చేయి ఎత్తినా బస్సు ఆపేవారు. ఇప్పుడు కుదరదని చెప్పడం సరికాదు.

– కుమారి, బత్తలపల్లి, శ్రీసత్యసాయి జిల్లా

ఒక రైతుకు ఒక బస్తానే!

- యూరియా కోసం రైతుల అవస్థలు
- ఈ– క్రాప్ బుకింగ్ చేసుకున్నవారికేనని మెలిక



బోరంపల్లిలో యూరియా కోసం ఉదయమే పాసుపుస్తకాలు క్యూలో ఉంచిన దృశ్యం

కళ్యాణదుర్గం: తగినంత నిల్వలు ఉన్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో రైతులకు మాత్రం యూరియా అందడం లేదు. అవసరాలకు అనుగుణంగా కాకుండా ఒక రైతుకు ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తున్నారు. ప్రభుత్వ తీరుపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అధిక శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పంటలకు అవసరమైన యూరియా సకాలంలో సరఫరా కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి, పాలవాయి, గోళ్ల గ్రామాల్లోని రైతు సేవ కేంద్రాల్లో పంపిణీకి ఏర్పాట్లు చేశారు. యూరియా కోసం రైతులు ఉదయం ఆరు గంటలకే పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నీళ్ల బాటిళ్లను క్యూలో ఉంచారు. ఆ తర్వాత వచ్చిన అధికారులు ఒక రైతుకు ఒక బస్తా.. అదీ యూరియా అవసరమైన మొక్కజొన్న, అరటి, టమాట తదితర పంటలను ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్నవారికే ఇస్తామని చెప్పారు. యూరియా ఇవ్వడానికి పిలిచి ఇప్పుడు ఈ క్రాప్ బుకింగ్ అంటూ మెలికలు పెట్టడమేంటని రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. బుకింగ్ చేసుకోని వారు అసంతృప్తితో వెనుదిరగాల్సి వచ్చింది.

స్టాకు వివరాలు వెల్లడించని అధికారులు

కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్‌లో ఏ రైతు సేవ కేంద్రానికి ఎంత యూరియా వచ్చిందని ఏడీఏ యల్లప్పను 'సాక్షి' అడగ్గా.. ఆయన వివరాలు చెప్పడానికి నిరాకరించారు. ఏఓను అడగాలని, లేదా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యాలయ సిబ్బందికి ఫోన్ చేసి అడిగినా యూరియా స్టాకు వివరాలు ఇవ్వకుండా కాలయాపన చేయడం విమర్శలకు తావిస్తోంది.



యూరియా కోసం క్యూ కట్టిన రైతులు

సారూ.. దృష్టి సారించండి

- పరిష్కారానికి నోచుకోని 2,668 'చుక్కల' ఫైళ్లు
- ఏడాదిన్నరగా జేఏల పదోన్నతులు పెండింగ్
- ఏడు చోట్ల భర్తీ కాని తహసీల్దార్ పోస్టులు
- నేడు విధులకు హాజరుకానున్న కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: జిల్లాలో కీలకమైన శాఖ రెవెన్యూ. ఈ శాఖలో కొన్ని సమస్యలు పరిష్కారం కాక దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నాయి. ప్రధానంగా చుక్కల భూముల ఫైళ్లు పరిష్కారానికి నోచుకోకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎవరికీ అసైన్డ్ చేయని ప్రభుత్వ భూములను చుక్కల భూములుగా నమోదు చేస్తారు. ఈ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు నిబంధనల ప్రకారం డి–పట్టా ఇస్తారు. ఇలా చుక్కల భూముల ఫైళ్లు 2,668 పెండింగ్‌లో ఉన్నాయి. డీఎల్‌సీ (డాటెడ్ ల్యాండ్ కమిటీ) సమావేశంలో ఈ ఫైళ్లను పరిశీలించి.. అన్నీ సక్రమంగా ఉంటే ఆమోదిస్తారు. నాగలక్ష్మి, గౌతమి కలెక్టర్లుగా పనిచేసిన కాలంలో ప్రతి డీఎల్‌సీ సమావేశంలో 150 నుంచి 200 ఫైళ్లు పరిష్కారమయ్యేవి. గత కలెక్టర్ హయాంలో ఫైళ్ల పరిష్కారం నత్తనడకన సాగింది.

జేఏలకు పదోన్నతి కల్పనలో జాప్యం

ఇక జూనియర్ అసిస్టెంట్‌లకు సీనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి కల్పించడంపై ఏడాదిన్నరగా జాప్యం చేస్తూ వచ్చారు. రెవెన్యూ శాఖలో 32 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదోన్నతికి అర్హతలు ఉన్న జూనియర్ అసిస్టెంట్‌లు 30 మంది ఉన్నారు. వీరికి పదోన్నతి కల్పించే విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చోటు చేసుకోవడంతో సర్వీసు పరంగా జూనియర్ అసిస్టెంట్‌లు నష్టపోతున్నారు. విచిత్రం ఏంటంటే అనంతపురం జిల్లాలో మినహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ జేఏలకు ఎస్‌ఏలుగా పదోన్నతి ప్రక్రియ ఏడాది క్రితమే పూర్తవడం.



కలెక్టర్ కార్యాలయం

మండలాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన

జిల్లాలోని నాలుగు మండలాల్లో ఇన్‌చార్జ్‌ల పాలన సాగుతోంది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిథ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గం పరిధిలోని కూడేరు మండలంలో ఏడాదిగా తహసీల్దారు స్థానం ఖాళీగా ఉంది. అదే విధంగా తాడిపత్రి, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లో తహసీల్దారు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఇక అనంతపురం, కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో డీఏఓ స్థానాలు ఖాళీగా ఉన్నాయి. కలెక్టరేట్‌లోని భూసంస్కరణల విభాగం సూపరింటెండెంట్ స్థానం ఖాళీగా ఉంది. సీనియర్ డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా అడహాక్ పదోన్నతి కల్పించి ఖాళీ స్థానాల్లో పోస్టింగ్ ఇస్తే సమస్య పరిష్కారం అవుతుంది. గతంలో చాలాసార్లు డీటీలకు అడహాక్ పదోన్నతి కల్పిస్తూ ఖాళీగా ఉన్న మండలాలకు తహసీల్దార్లుగా నియమించారు. గత అధికారులు ఈ అంశంపై దృష్టిపెట్టకుండా ఇన్‌చార్జ్ పాలనకే మొగ్గు చూపారు.

పనులు చేయించుకుని..

కలెక్టరేట్, కలెక్టర్ క్యాంపు కార్యాలయం (బంగ్లా)లో సుందరీకరణ పనులు చేయించుకున్నారు. ఇందుకు సంబంధించి దాదాపు రూ.70 లక్షలకు పైగా బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. ఏడాది దాటినా బిల్లులు రాకపోవడంతో వారు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఈ పనులను ప్రొసీడింగ్ కానీ, వర్కర్ ఆర్డర్ కానీ ఇవ్వకుండా చేయించారు. కలెక్టర్ మారడంతో ఆ బిల్లులు వస్తాయా.. రావా అని కాంట్రాక్టర్లు ఆందోళనకు గురవుతున్నారు.

యూరియా కొరతపై కన్నెర్ర

- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో నిలదీసిన సభ్యులు
- యూరియాను తన్నుకుపోతున్నదెవరో నిగ్గు తేల్చాలని డిమాండ్
- రైతులే అదనంగా తీసుకెళ్తున్నారని ఎంపీ అంబికా వ్యాఖ్యలు
- డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేసి ఆదుకోవాలన్న చైర్‌పర్సన్ గిరిజమ్మ



యూరియా కొరతపై నిలదీస్తున్న జెడ్పీటీసీ సభ్యులు

అనంతపురం సిటీ: యూరియా కొరతపై సభ్యులు కన్నెర్రజేశారు. రైతుల అవసరాలకు తగ్గట్టు యూరియాను సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. జిల్లాకు వస్తున్న యూరియా ఎక్కడికెళ్లిపోతోందని నిలదీశారు. యూరియాను తన్నుకుపోతున్న గద్దలెవరో నిగ్గు తేల్చాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల జాయింట్ కలెక్టర్లు శివ్ నారాయణ్ శర్మ, అభిషేక్ కుమార్, సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ జీవీ సుబ్బయ్య హాజరయ్యారు. యూరియా కొరతపై జిల్లా వ్యాప్తంగా రైతులు ఆందోళనలు కొనసాగిస్తున్న విషయాన్ని జెడ్పీటీసీ సభ్యులు ప్రస్తావించారు. గుమ్మఘట్ట, అనంతపురం రూరల్, చెన్నేకొత్తపల్లి, పరిగి జెడ్పీటీసీ సభ్యులు మహేశ్, చంద్రకుమార్, గోవిందరెడ్డి, శ్రీరామప్ప యూరియా కొరత గురించి ప్రస్తావిస్తూ రైతుల ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. కర్ణాటకలో తక్కువ ధరకే యూరియా దొరుకుతోందని, ఏపీలో ఎందుకు కొరత వస్తోందని నిలదీశారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న యూరియాను కొందరు దళారులు కుమ్మక్కై పక్కదారి పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై అనంతపురం ఎంపీ స్పందిస్తూ కేంద్ర మంత్రి నడ్డాతో మాట్లాడి కావాల్సినంత యూరియా తెప్పిస్తున్నట్లు తెలిపారు. అయితే డిమాండ్ రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు. దీనికి కారణం.. అవసరానికంటే ఎక్కువ యూరియాను రైతులు తీసుకెళ్లడమేనని పేర్కొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ స్పందిస్తూ.. రైతుల సమస్యలను సానుకూల దృక్పథంతో అర్థం చేసుకొని డిమాండ్‌కు తగ్గట్టు యూరియా సరఫరా చేసి ఆదుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ రైతుల అవసరాల మేరకు ప్రభుత్వం యూరియా సరఫరా చేస్తోందని, ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. తమ ప్రాంతంలో మొక్కజొన్న ఎక్కువగా సాగవుతోందని, మద్దతు ధర ప్రకటించి, ప్రభుత్వమే కొనుగోలు చేస్తే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని లేపాక్షి జెడ్పీటీసీ సభ్యుడు శీనురెడ్డి సభ దృష్టికి తెచ్చారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు గౌరవ వేతనం ఇస్తారో ఇవ్వరో తేల్చాలని రొద్దం జెడ్పీటీసీ సభ్యురాలు హరేసముద్రం పద్మ కోరారు. తల్లికి వందనం రాని వారి జాబితా ఇవ్వాలని జిల్లా విద్యా శాఖాధికారులను అడుగుతున్నా ఎందుకు ఇవ్వడం లేదని బుక్కరాయసముద్రం జెడ్పీటీసీ సభ్యుడు నీలం భాస్కర్ నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రజాప్రతినిధులు కాని వారిచేత జాతీయ పతాకావిష్కరణ చేయిస్తున్నా విద్యాశాఖ అధికారులు ఏం చేస్తున్నారని అనంతపురం రూరల్ జెడ్పీటీసీ చంద్ర ప్రశ్నించారు. ప్రొటోకాల్ పాటించకపోయినా.. బయటి వ్యక్తులతో జెండా ఆవిష్కరణ చేయించినా చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ హెచ్చరించారు.

ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్‌పై వాగ్వాదం

ఆర్డీటీకీ ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ అంశంపై సభలో వాగ్వాదం జరిగింది. బడుగు, బలహీన వర్గాలవారి పాలిట జీవనాడిగా ఉన్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని జిల్లాలోని అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, దళితులు, గిరిజనులు, బీసీలు ఆందోళనలు చేస్తున్నా కేంద్రంలోని బీజేపీ పెద్దలు ఎందుకు స్పందించడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో కీలకంగా ఉన్న బీజేపీ పెద్దలతో ముఖ్యమంత్రి, మంత్రులు ఎందుకు ఒత్తిడి పెంచడం లేదన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ స్పందిస్తూ కేంద్రంలోని పెద్దలందరినీ కలసి విన్నవిస్తున్నామని, ఇక్కడ రాజకీయాలు చేయడం మంచిది కాదని అన్నారు. దీంతో సభ్యులందరూ మూకుమ్మడిగా నిలదీశారు. ఆర్డీటీకి నిధులు వస్తే గానీ పేదల జీవితాల్లో వెలుగులు నిండవని పేర్కొన్నారు. వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో జెడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుని సద్దుమణిగించారు.

సర్వజనాస్పత్రిలో అక్రమాలపై ఆందోళన

అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో జరుగుతున్న అక్రమాలు, వ్యవహారాలపై గోరంట్ల, అనంతపురం జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాం నాయక్, చంద్రకుమార్ సభ దృష్టికి తెచ్చారు. ఈసీజీ, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్ సహా విలువైన రక్త పరీక్షలన్నీ పెద్దాస్పత్రిలోనే చేయించాలని ప్రభుత్వం ఆదేశించినా.. యంత్రాలు చెడిపోయాయంటూ రోగులను సత్యం డయాగ్నస్టిక్‌కు ఎందుకు పంపుతున్నారని నిలదీశారు. ప్రతి నెలా రూ.18 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఎందుకు చెల్లించాల్సి వస్తోందని, ఈ వ్యవహారంలో ఎవరెవరికి ఎంతెంత వాటా ముడుతోందని ప్రశ్నించారు. సమాధానం చెప్పాల్సిన సూపరింటెండెంట్ గైర్హాజరు కావడంపై జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీ మండిపడ్డారు. సర్వజనాస్పత్రిలో మహిళా రోగులకు, సహాయకులకు రక్షణ కరువైపోయిందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

'నువ్వ ఉండమ్మా..'

ఆర్డీటీ అంశంపై జెడ్పీటీసీ సభ్యులు ప్రశ్నల వర్షం కురిపిస్తుండగా ఎంపీ అంబికా వారించబోయారు. జోక్యం చేసుకున్న గిరిజమ్మనుద్దేశించి 'నువ్వ ఉండమ్మా.. అంటూ ఏకవచనంతో సంబోధించారు. ఇందుకు గిరిజమ్మ దీటుగా స్పందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ హోదాలో సభను నడిపిస్తుంటే ఏకవచనంతో ఎలా మాట్లాడుతారంటూ నిలదీయడంతో ఎంపీ సర్దుకున్నారు. తరువాత గుమ్మఘట్ట ఎంపీపీ భవాని మాట్లాడుతూ తాను దళితురాలినని ఎంపీడీఓ వివక్ష చూపుతున్నారని, జెడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓ దృష్టికి తెస్తే ఎటువంటి చర్యలూ తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఈఓ డొంక తిరుగుడు సమాధానాలు ఇవ్వడంతో మిగిలిన జెడ్పీటీసీ సభ్యులందరూ ఒక్కసారిగా ఎదురు తిరిగారు. ఒక ప్రజాప్రతినిధికి ఇంత అవమానం జరిగితే చూస్తా.. చేస్తా అంటారా అంటూ మండిపడ్డారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, చిత్రంలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, జేసీ శివ్ నారాయణ్‌శర్మ తదితరులు

ప్రజాస్వామ్యానికి విఘాతం



కూటమి పాలన వైఫల్యాలను ఎత్తి చూపుతున్న 'సాక్షి' మీడియాపై కూడా రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయడం అన్యాయం. ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగిస్తూ సాక్షి దిన పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డితో పాటు పలువురు జర్నలిస్టులపై బనాయించిన అక్రమ కేసులను బేషరతుగా ఉపసంహరించుకోవాలి. పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేకపోతే ఖండించాలి కానీ కేసులతో భయపెట్టాలనే ఆలోచన దుర్మార్గం. సాక్షి పత్రిక విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలి.
– మెట్టు గోవిందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, రాయదుర్గం



అక్రమ కేసులు ఎత్తివేయాలి



ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తున్నారనే అక్కసుతో కక్ష కట్టి సాక్షి పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి, విలేకరులపై అక్రమ కేసులు బనాయించారు. ఇది సరి కాదు. గత ప్రభుత్వంలో అక్రమంగా కేసులు బనాయిస్తున్నారంటూ నాడు గగ్గోలు పెట్టిన టీడీపీ పెద్దలు.. నేడు వారు చేస్తున్నదేమిటో ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాలి. కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న తీరు రాజ్యాంగ విరుద్ధం.
– ఈ.కుళ్లాయిస్వామి, జిల్లా ప్రధానకార్యదర్శి, ఏఐఎస్ఎఫ్

క్లుప్తంగా

'వందేభారత్'కు అంతరాయం



ధర్మవరం గేట్ వద్ద ఆపేసిన వందేభారత్ రైలు

గుంతకల్లు: బెంగళూరు నుంచి కలబురిగి వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు అంతరాయం ఏర్పడింది. గుంతకల్లులోని ధర్మవరం ఎల్‌సీ గేట్ వద్ద మంగళవారం సాయంత్రం వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, గూడ్స్ రైలు రాకపోకలు సాగించాయి. ఈ నేపథ్యంలో గేట్ తరుచూ వేయడంతో గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో వాహనాదారులు విసుగెత్తిపోయారు. అదే సమయంలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ వస్తుండగా మరోసారి గేట్ వేయడానికి ప్రయత్నిస్తుండగా ట్రాఫిక్ జామ్ అయి గేట్ వేయడానికి సాధ్యపడలేదు. దీంతో ధర్మవరం గేట్ సమీపంలో దాదాపు 15 నిమిషాల సేపు వందే భారత్‌ను నిలబెట్టేశారు. అనంతరం వాహనాదారులను బతిమలాడుకుని గేట్ వేయడంతో రైలు ముందుకు కదిలింది.

నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

అనంతపురం టవర్‌క్లాక్: గత విద్యాసంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఉద్యోగుల సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 30 తేదీలోపు దరఖాస్తులను ఎం.శ్రీనివాసులు, డోర్ నంబర్ 18/1/406, వేణుగోపాల నగర్, అనంతపురం - 515005కు పంపాలి. పూర్తి వివరాలకు 94412 22874లో సంప్రదించవచ్చు.

సొసైటీ కార్యాలయంపై వైఎస్సార్ పేరు తొలగింపు



పేరును చెరిపేస్తూ రంగులు వేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సహకార సొసైటీ కార్యాలయంపై ఉన్న మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేరును తొలగిస్తూ రంగులు వేశారు. రైతాంగానికి డాక్టర్ వైఎస్సార్ చేసిన సేవలకు గుర్తుగా బీకేఎస్‌లోని సహకార సొసైటీ కార్యాలయానికి 2009లో బోర్డు డైరెక్టర్లు రైతుల ఆమోదంతో డాక్టర్ వైఎస్‌రాజశేఖరరెడ్డి సహకార సంఘం కార్యాలయంగా పేరు పెట్టారు. ఇది జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు మంగళవారం వైఎస్సార్ పేరును తొలగిస్తూ రంగులు వేయడాన్ని గమనించిన పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

'మెరిట్' లిస్ట్.. 'సెలక్షన్' ట్విస్ట్

- డీఎస్సీ–2025 నియామక ప్రక్రియలో గందరగోళం
- ఒకే కేటగిరీలో వెనకున్న అభ్యర్థులను ఎంపిక చేసిన అధికారులు
- వైకల్యమే లేకున్నా దివ్యాంగుల కోటాలో ఉద్యోగం



ఎంపిక జాబితాలో తన పేరు లేకుండా తనకంటే వెనకున్న 8 మంది పేర్లు ఉన్నాయంటూ డీఈఓకు విన్నవిస్తున్న అభ్యర్థి ఆంజనేయులు

అనంతపురం ఎడ్యుకేషన్: మెరిట్ జాబితాలో ముందున్న అభ్యర్థుల కంటే వెనుక ఉన్న వారు పోస్టులకు ఎంపికవడంతో అర్హులైన డీఎస్సీ - 25 అభ్యర్థుల్లో గందరగోళం నెలకొంది. పారదర్శకత పేరుతో అభ్యర్థులకు పూర్తిస్థాయి సమాచారం చేరవేయకుండా రాష్ట్రస్థాయి అధికారులే ఎంపిక ప్రక్రియ చేపట్టడం వివాదానికి కారణమైంది. ఒక పోస్టుకు ఒక అభ్యర్థినే ఎంపిక చేసి సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. ఒకట్రెండు కాదు.. మొత్తం 5 సార్లు నిపుణులతో సర్టిఫికెట్ల పరిశీలన చేయించారు. కాల్‌లెటర్లు అందని అభ్యర్థులు, ఏవైనా సర్టిఫికెట్లు పొందుపరచని వారు ఉంటే చివరి విడత వరకూ అవకాశం కల్పించారు. అయినా అర్హులు అనర్హులుగా, అనర్హులు అర్హుల జాబితాలో కనిపిస్తుండడంతో ఆందోళన మొదలైంది.

తనకంటే వెనకున్న వారిని ఎంపిక చేశారంటూ..

బీసీ–ఏ కేటగిరీకి చెందిన ఎ.ఆంజనేయులు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ మెరిట్ జాబితాలో 48వ ర్యాంకులో ఉన్నాడు. సర్టిఫికెట్ల పరిశీలన రోజు ఒరిజనల్ పత్రాలు లేని కారణంగా ఫ్రీజింగ్ జాబితాలో ఉంచారు. గడువులోపు ఎస్కేయూకు వెళ్లి ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొచ్చి అధికారులకు అందజేయడంతో అన్‌ఫ్రీజ్ చేసి అర్హత జాబితాలో ఉంచారు. చివరకు అతని కంటే తక్కువ మార్కులు, తక్కువ ర్యాంకు వచ్చిన వారికి ఉద్యోగం వచ్చింది. సెలక్షన్ జాబితాలో ఆంజనేయులు పేరు మాయమైంది. ఇలా అతని కంటే వెనకున్న 8 మందిని అర్హుల జాబితాలోకి చేర్చడం అనుమానాలకు తావిస్తోంది. అలాగే ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్, పీఈటీ రెండు పోస్టులకూ ఎంపికైన చంద్రిక.. కేజీబీవీలో పని చేస్తూ బీపీఈడీ చేసిందనే నెపంతో ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టు కాకుండా యూజీపీడీ అర్హతతో పీఈటీ పోస్టుకు ఎంపిక చేశారు. తుది జాబితాలో మాత్రం ఆమె కంటే తక్కువ మార్కులు వచ్చిన వారి పేర్లు కనిపిస్తున్నా.. చంద్రిక పేరు మాత్రం లేదు. తమకు జరిగిన అన్యాయంపై వీరిద్దరూ డీఈఓకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

20 మందికి పైగా అభ్యర్థుల పేర్లు గల్లంతు

జిల్లా అధికారుల వద్ద సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరై పోస్టులు రాని వారు దాదాపు 20 మందికిపైగా ఉన్నారు. వాస్తవానికి ఒక పోస్టుకు ఒక అభ్యర్థినే సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. కాల్‌లెటర్లు అంది సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినా తుది జాబితాలో వారి పేర్లు కనిపించలేదు. మరి ఇంత మంది సెలక్షన్ జాబితాలో ఎందుకు లేరనేది అంతు చిక్కని ప్రశ్నగానే మిగిలింది. ఈ లాజిక్ పీటముడి అధికారులకే తెలియాలని అభ్యర్థులు వాపోతున్నారు. ఈ క్రమంలో పలువురు అభ్యర్థులు డీఈఓ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. వారు ఇస్తున్న అర్జీలను తీసుకుంటూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఈఓ కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు.

అనర్హుడికి దివ్యాంగుల కోటాలో ఉద్యోగం

కె.శ్రీనివాసులు అనే వ్యక్తి మానసిక అనారోగ్యం (ఎంఐ) కేటగిరీలో మెరిట్ జాబితాకు ఎంపికయ్యాడు. వెరిఫికేషన్ సమయంలో 70 శాతం వైకల్యం ఉన్నట్లు మెడికల్ సర్టిఫికెట్ చూపించాడు. ఆ సర్టిఫికెట్ ఆధారంగా వెరిఫికేషన్ బృందం తుది నిర్ధారణగావించి అప్‌లోడ్ చేసింది. అనంతరం మెడికల్ సర్టిఫికెట్ ధ్రువీకరణ కోసం అతడిని సర్వజనాస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ వైద్యులు పరీక్షలు చేయకముందే శ్రీనివాసులు ఉడాయించాడు. ఇంతలో మతలబు ఏమి జరిగిందో ఏమో కానీ నేరుగా విజయవాడకు వెళ్లి విద్యాశాఖ కమిషనర్‌ను కలిసి, మళ్లీ వైద్య పరీక్షలు చేయించాలంటూ అక్కడి నుంచి ఆదేశాలు తీసుకొచ్చాడు. దీంతో డీఈఓ స్వయంగా రంగంలోకి దిగి సదరు అభ్యర్థిని సర్వజన ఆస్పత్రికి తీసువెళ్లి వైద్య పరీక్షలు చేయించారు. ఎలాంటి మానసిక ఆరోగ్యం లేదని వైద్యులు ధ్రువీకరించారు. వైకల్యశాతం '0'గా నిర్ధారించారు. ఈ సర్టికెట్‌ను అప్‌లోడ్ చేసి అనర్హుడిగా నిర్ధారించాల్సి ఉంది. మరి ఏమి జరిగిందో తెలియదు కానీ ఆయనకు మాత్రం ఉద్యోగం వచ్చింది. ఆస్పత్రి నుంచి ఉడాయించిన రోజే మెడికల్ టెస్ట్‌కు గైర్హాజరు కారణంగా అనర్హుడి జాబితాలో ఉంచాలని డీఈఓ ఆదేశించినా.. వెరిఫికేషన్ బృందం ధిక్కరిస్తూ అర్హుడి జాబితాలో ఉంచడం వెనుక ఆంతర్యమేమిటి? దీని వెనుక ఎవరు చక్రం తిప్పారనే చర్చ జోరుగా జరుగుతోంది.

చెర్లోపల్లి కాలనీలో పర్యటించిన వైద్యాధికారులు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి

సాక్షి ఎఫెక్ట్..

గుత్తి: 'ముగ్గురు చిన్నారులకు డెంగీ' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై వైద్యాధికారులు స్పందించారు. మండలంలోని చెర్లోపల్లి కాలనీలో మంగళవారం అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ అమర్‌నాథ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రభాకర్, వైద్య సిబ్బంది పర్యటించారు. డెంగీ బారిన పడిన ముస్తాక్, షణ్ముఖ, వెంకటకృష్ణను నుంచి రక్త నమూనాలు సేకరించి, వైద్య పరీక్షలకు పంపారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. దోమల నివారణకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ ఉపాధ్యాయుడు మాకొద్దు!

- పాఠశాల వద్ద గ్రామస్తుల నిరసన



ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న మహంతపురం గ్రామస్తులు

కుందుర్పి: మండలంలోని మహంతపురం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు జక్కెల శివశంకర్ తమ పాఠశాలకు వద్దంటూ ఆ గ్రామస్తులు మంగళవారం పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మరో ప్రాంతానికి వెళ్లిన శివశంకర్ తిరిగి ఇదే పాఠశాలలో పనిచేసేందుకు డీఈఓ నుంచి అనుమతులు పొందినట్లుగా సోమవారం ఎంఈఓ కార్యాలయానికి ఉత్తర్వులు అందినట్లుగా తెలుసుకున్న గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2021లో గ్రామంలోని పాఠశాలకు బదిలీపై వచ్చిన ఆయన విధులకు సక్రమంగా హాజరు కావడం లేదంటూ వాపోయారు. ఉపాధ్యాయుడి తీరుతో పాఠ్యాంశాల్లో పిల్లలు వెనుకబడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే అంశంపై పలుమార్లు డీఈఓకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామంటూ హెచ్చరించారు. అనంతరం ఎంఈఓలు శంకరన్న, తిప్పేస్వామిని కలసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జగన్, ఎంపీటీసీ సభ్యుడు ఈరన్న, పాఠశాల కమిటీ సభ్యులు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళా లోక చైతన్య దీప్తి సావిత్రిబాయి పూలే

- విగ్రహావిష్కరణ సభలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ



సావిత్రాబాయి పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గిరిజమ్మ, తదితరులు

అనంతపురం సిటీ: మహిళా లోకానికి చైతన్య దీప్తి సావిత్రిబాయిపూలే అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జిల్లా పరిషత్ క్యాంపస్‌లో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ మంగమ్మ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల జాయింట్ కలెక్టర్లు శివ్‌నారాయణ్ శర్మ, అభిషేక్ కుమార్, జెడ్పీ వైస్ చైర్మన్లు వేదాంతం నాగరత్నమ్మ, సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలతో కలసి బుధవారం ఆమె లాంఛనంగా ప్రారంభించి, మాట్లాడారు. విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని బలంగా నమ్మిన సావిత్రిబాయి పూలే తొలుత తానే విద్యాభ్యాసం మొదలుపెట్టి తొలి మహిళా ఉపాధ్యాయినిగా మహిళా లోకానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. జెడ్పీ క్యాంపస్‌లో జ్యోతిబా పూలే విగ్రహం ఉండగా..దాని పక్కనే మహిళా లోకానికే మహారాణిగా మారిన సావిత్రిబాయి పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. పూలే దంపతుల జీవితాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శంకర్, డిప్యూటీ సీఈఓ సుబ్బయ్య, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి, అన్ని శాఖల అధికారులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

యూరియా ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వం

- సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి



ధర్నా అనంతరం టెక్నికల్ ఏఓకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అగ్రికల్చర్: రైతులకు యూరియా కూడా ఇవ్వలేని అసమర్థ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పాలన సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్యం నారాయణస్వామి విమర్శించారు. యూరియా కొరత, ప్రత్యామ్నాయ విత్తనాలు ఇవ్వాలనే డిమాండ్‌తో మంగళవారం అనంతపురంలోని వ్యవసాయశాఖ జేడీ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి, సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున మాట్లాడారు. ఆర్‌ఎస్‌కేల్లో తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఉలవ, సజ్జ, రాగి, జొన్న, కొర్ర తదితర ప్రత్యామ్నాయ విత్తనాలు అందివ్వాలని కోరారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి రైతుకూ నెలకు రూ.10 వేలు ప్రకారం పింఛన్ చెల్లించాలన్నారు. రైతు రుణాలు మాఫీ చేసి తిరిగి కొత్త రుణాలు అందివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం టెక్నికల్ ఏఓ వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

జిల్లాకు 1,482 మెట్రిక్ టన్నుల యూరియా

అనంతపురం అగ్రికల్చర్: రాష్ట్రీయ కెమికల్ ఫర్టిలైజర్స్ (ఆర్‌సీఎఫ్) నుంచి 1,482.30 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు సరఫరా అయినట్లు రేక్ ఆఫీసర్, ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌కు వ్యాగన్ల ద్వారా చేరిన యూరియాను ఆయన పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్‌కు 899.01 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 583.29 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు. అక్కడి నుంచి ఇండెంట్ మేరకు ఆర్‌ఎస్‌కేలు, సొసైటీలు, రీటైల్ దుకాణాలకు సరఫరా చేస్తారని వివరించారు.

5.30 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల విక్రయాల నిలుపుదల

శింగనమల(నార్పల): నార్పల మండలంలోని ఎరువుల దుకాణాలను మంగళవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో వ్యవసాయ, పోలీసు అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. పుడమి అగ్రిమార్ట్, సంకల్ప ఎరువుల దుకాణాల్లో భౌతిక నిల్వలకు, స్టాక్ రిజిస్టర్‌కు తేడాలు ఉన్నట్లుగా గుర్తించి రూ.1.43 లక్షల విలువ చేసే 5.30 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువుల విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ నోటీసులు ఇచ్చారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ నరేంద్ర భూపతి, ఏఓ జె.వాసు ప్రకాష్, నార్పల ఏఓ చన్నవీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మిద్దె కుళ్లాయప్ప

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శింగనమల నియోజకవర్గానికి చెందిన మిద్దె కుళ్లాయప్ప నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఉత్తుర్వులు జారీ చేసింది.

సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తాం

- కలెక్టరేట్ ఎదుట ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే దశలవారీగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కూటమి ప్రభుత్వాన్ని ఏపీటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంటకేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గొని పాతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. 12వ వేతన సంఘాన్ని నియమించాలన్నారు. 30 శాతం మధ్యంతరభృతిని ప్రకటించాలన్నారు. బకాయిపడిన నాలుగు డీఏలను విడుదల చేయాలన్నారు. బోధనా సమయాన్ని వృథా చేస్తున్న అసెస్మెంట్ బుక్లెట్ విధానాన్ని ఉపసంహరించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదన్నారు. ఓపీఎస్ అమలు చేయాలన్నారు. రాష్ట, జిల్లా నాయకులు నరేష్‌కుమార్, సుభద్ర, సర్దార్‌వలి, వెంకటరమణ, కృష్ణ, అంజలీదేవి, ప్రేమావతి, శ్రీదేవి, వన్నప్ప, బాల రామ్మోహన్, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన అభ్యర్థులూ తరలిరండి : డీఈఓ

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–25లో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులందరూ ఈ నెల 19న అమరావతిలో జరిగే సమావేశానికి హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబు తెలిపారు. మంగళవారం తన చాంబరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన అభ్యర్థితో పాటు తోడుగా మరొకరు విజయవాడకు రావచ్చన్నారు. ప్రయాణ ఖర్చులు, వసతి, భోజన సదుపాయాలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. 18న ఉదయం 6 గంటలకు అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని పీవీకేకే ఇంజినీరింగ్ కళాశాలకు చేరుకోవాలన్నారు. ప్రతి బస్సుకు నలుగురు చొప్పున లైజన్ ఆఫీసర్లను నియమిస్తామన్నారు. 19న మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సీఎం చంద్రబాబుతో మీటింగ్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరికీ కిట్టుతో పాటు అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందజేస్తారని, అదే రోజు రాత్రి బయలుదేరి మరుసటి రోజు ఉదయం జిల్లాకు చేరుకుంటారన్నారు.

తాగుడుకు డబ్బు ఇవ్వలేదని..

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం కక్కలపల్లికాలనీ పంచాయతీ పరిధిలోని దండోరా కాలనీలో నివాసముంటున్న గోవిందు (55) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. పెయింటింగ్ పనులతో కుటుంబాన్ని పోషించుకునేవాడు. భార్య కూలి పనులకు వెళ్లేది. ఈ క్రమంలో తాగుడుకు బానిసైన గోవిందు... నిత్యం మద్యం మత్తులో జోగుతూ జులాయిగా మారాడు. మద్యం తాగేందుకు డబ్బు కావాలని సోమవారం సాయంత్రం భార్యతో గొడవపడ్డాడు. ఆమె ఇవ్వక పోవడంతో రాత్రి గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంతర్ జిల్లా ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

- నిందితుడు టీడీపీ కార్యకర్త



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గుంతకల్లు రూరల్/వెల్దుర్తి: అంతర్ జిల్లా ద్విచక్ర వాహనాల దొంగను అరెస్ట్ చేసి, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు గుంతకల్లు రూరల్ పీఎస్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక కసాపురం పీఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. సోమవారం సాయంత్రం బుగ్గ సంగాల వద్ద వాహనాల తనిఖీలు చేపట్టిన సమయంలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్న యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో ద్విచక్ర వాహనాల అపహరణ అంశం వెలుగు చూసింది. పట్టుబడిన యువకుడిని కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం ఎల్.నగరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పింజారి షెక్షావలిగా గుర్తించారు. నాలుగు పల్సర్ బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కాగా, గతంలో బుక్ కీపర్‌గా పనిచేసిన షెక్షావలిపై కసాపురం పీఎస్‌లో 2, కర్నూలు త్రీటౌన్ పీఎస్‌లో 1, గుంతకల్లు రెండో పట్టణ పీఎస్‌లో 1 చొప్పున కేసులున్నాయి.

బీటెక్ విద్యార్థిని బలవన్మరణం

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న ధనలక్ష్మి (20) అదే కళాశాల హాస్టల్ గదిలో మంగళవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంది. గదిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆమె ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

'కూటమి'కి బుద్ధి చెబుతాం

- విద్యారంగ, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలి
- యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్‌కుమార్



యూటీఎఫ్ రణభేరి ప్రచార జాతా ప్రారంభిస్తున్న సురేష్‌కుమార్

గుంతకల్లుటౌన్: ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి అన్నారు. విద్యారంగ, ఆర్థిక సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 25న విజయవాడలో తలపెట్టిన రణభేరి కార్యక్రమానికి సంబంధించిన ప్రచార జాతా మంగళవారం గుంతకల్లుకు చేరుకుంది. రణభేరిని విజయవంతం చేయాలంటూ స్థానిక సరోజినీనాయుడు మున్సిపల్ స్కూల్ నుంచి హనుమాన్ సర్కిల్ వరకూ ఉపాధ్యాయులు బైక్‌ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు, పీఆర్సీ బకాయిలను చెల్లించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం చర్చలు జరిపి వెంటనే పీఆర్సీని నియమించి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు రమణయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, సహ అధ్యక్షుడు రామప్పచౌదరి, జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, స్థానిక నాయకులు శ్రీనివాసులు, రవిబాబు, శంకరయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చొరవ చూపకపోతే తీవ్ర పరిణామాలు

ఉరవకొండ: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కూటమి ప్రభుత్వాన్ని యూటీఎఫ్ నాయకులు హెచ్చరించారు. యూటీఎఫ్ అధ్వర్యంలో చేపట్టిన రణబేరి ప్రచార జాతా మంగళవారం ఉరవకొండలో ప్రవేశించింది. స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర సహ అధ్యక్షుడు సురేష్‌కుమార్, లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి మాట్లాడారు. విద్యా వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. పిల్లలకు పాఠాలు చెప్పనివ్వకుండా ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అంటగట్టి, యాప్‌ల పేరుతో వేధింపులకు గురి చేస్తోందన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగిస్తే బోధనేతర పనులను బహిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రమణయ్య, పూర్వ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, శేఖర్, మండల నాయకులు పాల్గొన్నారు.

పశుశాఖ జేడీగా ప్రేమ్‌చంద్

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ ఏహెచ్)గా డాక్టర్ పి.ప్రేమ్‌చంద్ నియమితులయ్యారు. విజయవాడలో పశుశాఖ డైరెక్టరేట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న ఈయనకు జేడీగా పదోన్నతి కల్పించి ఇక్కడకు బదిలీ చేశారు. అలాగే ఇక్కడ డీడీగా, ఇన్‌చార్జ్ జేడీగా ఉన్న డాక్టర్ టీవీ సుధాకర్‌కు జేడీగా పదోన్నతి కల్పించి విజయవాడ డైరెక్టరేట్‌కు బదిలీ చేశారు. ఇక ధర్మవరం డివిజన్ డీడీ డాక్టర్ బి.చంద్రశేఖర్‌కు జేడీగా పదోన్నతి కల్పించి ఫారిన్ సర్వీసు కింద నెల్లూరు జిల్లా చింతలదీవి ఫామ్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఒకట్రెండు రోజుల్లో నూతన జేడీ బాధ్యతలు తీసుకునే అవకాశం ఉందని ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

ప్యాచ్ వేద్దాం.. మళ్లీ మళ్లీ!

- రూ.40 లక్షలతో ప్యాచ్ వర్కులు
- గతంలో రూ.47 లక్షలతో పనులు
- అనతికాలంలోనే తేలిపోయిన రోడ్లు
- వృథా అవుతున్న ప్రజాధనం

నగరపాలక సంస్థ వివరాలు	
మొత్తం డివిజన్లు :	50
సచివాలయాలు :	74
ఇటీవల టెండర్లు పిలిచిన ప్యాచ్ పనులు :	20
అందుకు నిర్దేశించిన మొత్తం :	రూ.40 లక్షల వరకు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థలో అభివృద్ధి పనులు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. తాము పన్నుల రూపేణ చెల్లించిన డబ్బును అభివృద్ధి పనుల పేరుతో వృథా చేస్తున్నట్లు నగర ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వంలో ఏర్పడ్డాక ఇప్పటికే నడిమివంక, మరువవంకలో పూడిక తీత పనులతో రూ.50 లక్షలకుపైగా బిల్లులు చేసుకున్నారు. ఇప్పుడు మరోసారి ప్యాచ్ వర్క్ పనులను చేపట్టేందుకు నగరపాలక సంస్థ ఇంజినీర్లు సిద్ధమయ్యారు.

సీఎం పర్యటన పేరుతో రూ.40 లక్షలతో పనులు

ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా ఆగమేఘాలపై టెండర్లను ఆహ్వానించారు. నగరంలోని 36 నుంచి 40 డివిజన్లలో రూ.8 లక్షలతో 4 ప్యాచ్ వర్క్‌లు, జీసస్‌నగర్‌లో రూ.7.60 లక్షలతో 4 పనులు, అశోక్‌నగర్ 4వ క్రాస్ రూ.9.90 లక్షలతో 4 పనులు, 26 నుంచి 30 డివిజన్లలో రూ.4.20 లక్షలతో 4 పనులు, 11 నుంచి 20 డివిజన్లలో రూ.9.90 లక్షలతో నాలుగు ప్యాచ్ పనులకు టెండర్లు పిలిచారు. కాగా ఇప్పటికే సాయినగర్, సప్తగిరి సర్కిల్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో ప్యాచ్ వర్క్ పనులు చేసినా.. ఇప్పటికే అవి తేలిపోయాయి. ఇంకా చాలా ప్యాచ్ వర్క్ పనులు చేయాల్సి ఉంది. ఇదిలా ఉండగా నగరంలో రోడ్ల విస్తరణతో పాటు అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. కానీ అటువంటి పరిస్థితి కన్పించడం లేదు. ప్యాచ్ పనులు చేసుకుంటూ ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారన్న విమర్శలున్నాయి.



ఇటీవల సాయినగర్‌లో ప్యాచ్ పనులు చేపడుతున్న దృశ్యం(ఫైల్)

గతంలోనే వృథా..

ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.47 లక్షలతో 275 ప్రాంతాల్లో ప్యాచ్ వర్క్ పనులను తూతూమంత్రంగా చేశారు. నగరంలోని సోమనాథ్‌నగర్, రజకనగర్, సప్తగిరి సర్కిల్, సాయినగర్, విద్యుత్‌నగర్, నాయక్‌నగర్, తిలక్ రోడ్డు, నీలిమా థియేటర్, రంగస్వామి నగర్ తదితర ప్రాంతాల్లో చేసిన ప్యాచ్ పనులు నెలల వ్యవధిలోనే కంకర తేలిపోయాయి. దీంతో రూ.లక్షల్లో ప్రజాధనం వృథా అయ్యింది. ఇంజినీర్లు ఇష్టారాజ్యంగా అంచనాలు వేస్తూ..కూటమి ప్రభుత్వంలోని తెలుగు తమ్ముళ్లు, కాంట్రాక్టర్ పరోక్షంగా లబ్ధి చేకూర్చుతున్నారన్న విమర్శలున్నాయి.

మేలుజాతి పశుసంతతి పెంపుపై దృష్టి

- పశుశాఖ జేడీ సుధాకర్

అనంతపురం అగ్రికల్చర్: మేలుజాతి పశు సంతతి ఉత్పత్తి ద్వారా పాడి అభివృద్ధి, రైతుల ఆర్థిక పురోభివృద్ధి సాధ్యమని పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ టీవీ సుధాకర్ తెలిపారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ (డీఎల్‌డీఏ) ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో) డాక్టర్ జి.వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం రూరల్ మండలం ఆకుతోటపల్లిలో ఉచిత గర్భకోశవ్యాధి శిబిరం నిర్వహించారు. జేడీతో పాటు డీడీ డాక్టర్ వై.రమేష్‌రెడ్డి, ఏడీలు ప్రకాష్, పద్మనాభం హాజరయ్యారు. ఈ సందర్భంగా పశువులను పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. పాడి రైతులు పశువుల పెంపకంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. లింగ నిర్ధారణ వీర్యం (సెక్స్ సార్టెడ్ సెమన్-ఎస్ఎస్ఎస్) ద్వారా గర్భధారణ (ఎద సూదులు) వేయించాలని సూచించారు. దీని ద్వారా 90 శాతం పెయ్య దూడలే జనిస్తాయన్నారు. జన్యుపరంగా మంచి ఆరోగ్యవంతమైన దూడలు, తద్వారా మేలు జాతి పశువుల సంతతి పెరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో అనంతపురం జిల్లాతో పాటు కుప్పం డివిజన్‌లో మాత్రమే పైలెట్ ప్రాజెక్టు కింద అమలు జరుగుతోందన్నారు. డీఎల్‌డీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉచిత పశువైద్య శిబిరాలు, మేలు జాతి దూడల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు.



పాడి ఆవును పరీక్షిస్తున్న పశుశాఖ జేడీ సుధాకర్, డీఎల్‌డీఏ ఈఓ వెంకటేష్, డీడీ రమేష్‌రెడ్డి

జేవీవీ రాష్ట్ర కమిటీలో అనంత వాసులకు చోటు

అనంతపురం కల్చరల్: జేవీవీ (జనవిజ్ఞాన వేదిక) రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన డాక్టర్ ప్రసూన, డాక్టర్ వీరరాజుకు చోటు కల్పించారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని సంగమేష్‌నగర్‌లోని జేవీవీ కార్యాలయంలో ఇటీవల విజయనగరంలో జరిగిన జేవీవీ రాష్ట్ర మహాసభల తీర్మానాలను మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షురాలిగా ఉన్న ప్రసూన, ప్రధాన కార్యదర్శిగా ఉన్న డాక్టర్ వీరరాజుతో పాటూ జిల్లాకు చెందిన సాకే భాస్కర్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యునిగా , మహ్మద్ జిలాన్ విద్యా సబ్ కమిటీ సభ్యులుగా, లక్ష్మీనారాయణ మ్యాజిక్ సబ్ కమిటీ సభ్యుడిగా, ప్రసాద్, నాగరత్న సమతా సబ్ కమిటీ సభ్యులుగా ఎన్నికవడం ఆనందంగా ఉందన్నారు. రాబోవు రోజుల్లో శాస్త్రీయ విజ్ఞాన ప్రచారం అనంత నుంచి రాష్ట్రవ్యాప్తం అవుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.



డాక్టర్ ప్రసూన



డాక్టర్ వీరరాజు

వినీత.. మారింది భవిత

- స్పోర్ట్స్ కోటాలో ఎస్‌జీటీ పోస్టుకు ఎంపిక
- పీడీ, మేనమామల సహకారంతో ఉద్యోగం సాధించిన వైనం

వజ్రకరూరు: గడేహోతూరుకు చెందిన కురుబ వినీత స్పోర్ట్స్(ఖోఖో) కోటాలో ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైంది. వినీత నాలుగేళ్ల వయసులోనే తండ్రి ఎర్రిస్వామి మరణించాడు. ఆతర్వాత తల్లి నాగమ్మ కూడా అనారోగ్యంతో మరణించింది. దీంతో వినీత మేనమామలు సిద్దప్ప,తీర్థప్ప, తిమ్మప్ప వద్ద ఉంటూ చదువుకుంది. వినీత ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు గడేహోతూరులోనూ, ఆరు నుంచి 10వతరగతి వరకు చిన్నహోతూరులో చదువుకుంది. అనంతరం ఇంటర్మీడియెట్ ఉరవకొండ, టీటీసీ అనంతపురంలోనూ, డిగ్రీ అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో చదువుకుంది. చిన్నతనంలోనే వినీత తల్లిదండ్రులు మరణించినా, ఓ వైపు చదువుతోపాటు మరోవైపు క్రీడల్లోనూ రాణిస్తూ వస్తోంది. పీడీ ప్రభాకర్ ప్రోత్సాహంతో వినీత 12 సార్లు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచింది. 2015లో కేరళలో జరిగిన 35వ జాతీయ స్థాయిక్రీడలు (ఖోఖో) పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్పోర్ట్స్ కోటాలో ఎస్‌జీటీ పోస్టుకు ఎంపికైంది. ఈనెల 19న సీఎం చంద్రబాబు చేతులమీదుగా నియామక పత్రం అందుకోనున్నట్లు వినీత తెలిపింది.



కురుబ వినీత

పేకాటరాయుళ్ల అరెస్టు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి సమీపంలో సోమవారం రాత్రి ఓ పేకాట స్థావరంపై ఎస్ఐ సురేష్ నేతృత్వంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.10,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

మేథో సంపత్తి హక్కులపై అవగాహన ఒప్పందం

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల, ఓల్క్‌స్పాంటమ్ ఐపీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేథో సంపత్తి హక్కుల (ఐపీఆర్) పరిరక్షణ, ఆవిష్కరణల ప్రోత్సాహకం కోసం అవగాహన (ఎంఓయూ) ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ బాలకృష్ణ తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా పేటెంట్లు, ట్రేడ్ మార్కులు, కాపీరైట్స్, ఇండస్ట్రియల్ డిజైన్‌లు, స్టార్టప్ రిజిస్ట్రేషన్లు, జియోగ్రాఫికల్ ఇండికేషన్ల వంటి మేథో సంపత్తి రక్షణకు తోడ్పాటు లభిస్తుందన్నారు. అలాగే టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ సామర్థ్యాభివృద్ధి మార్గదర్శక మద్దతు ద్వారా విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆవిష్కరణ, వాణిజ్యీకరణ స్థిరమైన అభివృద్ధికి ప్రోత్సాహకంగా ఉంటుందన్నారు. ఈ భాగస్వామ్యం విద్యార్థుల ఆవిష్కరణలకు, మేథో సంపత్తిని రక్షించడానికి మంచి అవకాశం కల్పించడంతో పాటు ఆవిష్కరణలను మార్కెట్‌లోకి తీసుకరావడానికి బలమైన వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఐఈడీపీ సెల్ కన్వీనర్ ఆంజినేయులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యూఏసీ డైరెక్టర్ సాయి చైతన్య కిషోర్, సీఎస్ఈ విభాగం అధిపతి వీర ప్రకాష్, సీఎస్‌డీ. సీఎస్ఎం విభాగం అధిపతి డాక్టర్ చిత్ర లింగప్ప, ఓల్క్‌స్పాంటమ్ ఐపీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ ఐపీఆర్ అటార్నీ మామిల్లపల్లి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న ఎస్ఆర్ఐటీ కళాశాల యాజమాన్యం, ఓల్క్‌స్పాంటమ్ ఐపీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్

జక్కల ఆదిశేషు కుటుంబానికి పరామర్శ

తనకల్లు: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, నల్లమాడ మాజీ జెడ్పీటీసీ జక్కల ఆదిశేషు కుటుంబాన్ని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. తనకల్లు మండలం బొంతలపల్లికి మంగళవారం చేరుకున్న ఆయన ఆదిశేషు భార్య, జెడ్పీటీసీ సభ్యురాలు జక్కల జ్యోతి, కుటుంబ సభ్యులు బొడ్డు నాగరాజు, అరుణను ఓదార్చారు. అనంతరం ఆదిశేషు సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ కదిరి నియోజకవర్గ మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, జిల్లా ఉపాధ్యక్షుడు బైక్ భాస్కరరెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లింగాల లోకేశ్వరరెడ్డి, నాయకులు రామ్‌దేశాయ్, మాజీ ఎంపీటీసీ రాందాస్, చలపతి, రవి, స్టోర్ వెంకటరెడ్డి, గౌస్, మండల కమిటీ సభ్యులు కరే నరేంద్ర, బాబ్జాన్, సూరి, రెడ్డిశేఖర్ రెడ్డి, తాహీర్, ఖాదర్‌వలి, సర్వేశ్వరరెడ్డి, సలీం, నారాయణరెడ్డి, యశ్వంత్‌రెడ్డి, రామమోహన్, మహేష్‌రెడ్డి, బాబు, నాగిరెడ్డి, గణేష్, హైదర్‌వలి, చాకివేలు రమణ, కిరణ్, నరసింహులు, నీలకంఠారెడ్డి, కిష్టప్ప, రామాంజి, కొండయ్య, నల్లచెరువు మండల నాయకులు విశ్వనాథ్‌రెడ్డి, దశరథనాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



బొంతలపల్లిలో జక్కల ఆదిశేషు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం పట్టణ పరిధిలోని అక్కమాంబ ఆలయం సమీపంలో ఆటో, కారు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. మంగళవారం కళ్యాణదుర్గం నుంచి బోరంపల్లికి వెళ్తున్న ఆటో.. అక్కమాంబ ఆలయం వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ ఓబులేసుతోపాటు కాడన్న, హేమంత్ గాయపడ్డారు. స్థానికులు వారిని సీహెచ్‌సీకి తరలించారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ ఆపరేటర్‌పై దాడి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని సీబీ రోడ్డు వద్ద మున్సిపల్ ఆపరేటర్ క్రిష్ణయ్యపై గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం దాడికి పాల్పడారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సీపీఐ కాలనీలో విధులు ముగించుకుని వస్తున్న క్రిష్ణయ్యను ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు మాస్కులు ధరించి ద్విచక్రవాహనంపై ఫాలో అయ్యారు. సీబీ రోడ్డులో ఉన్న దివాకర్ పెట్రోల్ బంక్ వద్దకు రాగానే 'గడ్డికయ్యల్లో గోతులు ఎందుకు తీశావురా' అంటూ రాడ్లు, కర్రలతో దాడి చేశారు. గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ విషయమై ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

ఫుట్‌పాత్ వ్యాపారం.. తప్పని ట్రాఫిక్ కష్టాలు





ఫుట్‌పాత్‌పై వ్యాపారం నిర్వహిస్తున్న చిరువ్యాపారులు



ఫుట్‌పాత్‌పై తోపుడు బండ్లు ఉంచిన దృశ్యం

నగరంలోని పీటీసీ ప్రహరీ పక్కన చిరువ్యాపారులు ఫుట్‌పాత్‌పై వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాయగూరలు, పండ్లు, తదితర వాటిని కొనుగోలు చేసేవారు అక్కడ గుమికూడుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. మరోవైపు పాదచారులు నడవడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్ అనంతపురం

క్లుప్తంగా

రైతుబజార్‌లో కిలో ఉల్లి రూ.10



అమ్మకానికి సిద్ధంగా ఉల్లిగడ్డలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక రైతు బజార్‌లో కిలో ఉల్లి రూ.10 ప్రకారం అమ్మకాలు చేస్తున్నట్లు ఎస్టేట్ అధికారి ప్రతాప్‌రుద్ర, సూపర్‌వైజర్ లోకేష్ తెలిపారు. కర్నూలు నుంచి నాణ్యమైన మీడియం సైజు ఉల్లిగడ్డలు 7 టన్నులు మంగళవారం జిల్లాకు సరఫరా అయ్యాయని, వినియోగదారులు ఉల్లిగడ్డలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉమ్రా యాత్రికులకు ఆత్మీయ సత్కారం



ఉమ్రాయాత్రకు వెళ్తున్నవారిని సత్కరించిన బహువుద్దీన్ మసీదు పెద్దలు

అనంతపురం కల్చరల్: నగరం నుంచి వెళ్తున్న 21 మంది ఉమ్రా యాత్రికులను మంగళవారం స్థానిక రెండోరోడ్డులోని బహువుద్దీన్ మసీదులో ఆత్మీయంగా సత్కరించారు. మసీదు ముతవల్లి ఫరీదుద్దీన్, ఇమాం యూసఫ్‌ఖాన్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన పెంచడానికి సాగుతున్న ఉమ్రాయాత్ర ఫలవంతం కావాలని ఆకాంక్షించారు. అంతకు ముందు ప్రత్యేక ప్రార్థనల అనంతరం తెహరిక్ ఫైజానే ఉమర్ ఫారూక్ అధ్యక్షుడు హసన్‌రాజా ఖాద్రి జెండా ఊపి ఉమ్రాయాత్రను ప్రారంభించారు. కార్యక్రమంలో మసీదు సెక్రటరీ పర్వేష్, షబ్బీర్ అహమ్మద్, హబీబ్, అబ్దుల్ సమీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

'మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకుంటే ఎలా బతకాలి?'



సూపరింటెండెంట్‌ను నిలదీస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం మెడికల్: మూడు నెలలుగా వేతనం ఇవ్వకుంటే ఎలా బతకాలంటూ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎల్ సుబ్రమణ్యంను సీఐటీయూ నాయకులు, పారిశుధ్య కార్మికులు నిలదీశారు. మంగళవారం సూపరింటెండెంట్ చాంబర్ ముందు వారు ధర్నా చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు . పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ సిబ్బంది పట్ల మరీ ఇంత దుర్మార్గంగా ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ధ్వజమెత్తారు. రౌండ్ ద క్లాక్ కార్మికులు ఆస్పత్రిని శుభ్రం చేస్తుంటారని, ఇటువంటి పరిస్థితుల్లో కార్మికులకు వేతనాలు జాప్యం చేయాలని ఎలా అన్పిస్తోందన్నారు. తక్షణం పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీకి వేతనాలు అందించాలని లేని పక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు ఎం నాగమణి, నగర కార్యదర్శి ముత్తుజా, నల్లమ్మ రేఖ, ఉమామహేశ్వరి, పుష్ప, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలకు నిప్పు



కాలిపోతున్న గుడిసెలు

కనగానపల్లి: మండల పరిధిలోని బద్దలాపురం గ్రామంలో హంద్రీనీవా కాలువ సమీపంలో వేసిన గుడిసెలకు మంగళవారం సాయంత్రం కాలిబూడిదయ్యాయి. స్థానికుల వివరాలమేరకు.. హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు చేసేందుకు వచ్చిన కూలీలు కాలువ సమీపంలో గుడిసెలు వేసుకొని ఉండేవారు. పనులు పూర్తి కావటంతో కూలీలంతా వేరేచోటికి వెళ్లిపోయారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న గుడిసెల వద్దకు సాయంత్రం ననకోట నుంచి తగరకుంట వైపు కారులో వెళ్తున్న కొందరు వ్యక్తులు వెళ్లారు. గుడిసెలకు వారే నిప్పు పెట్టి ఉంటారని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి మట్టలతో వేసిన గుడిసెలు కావటంతో పూర్తిగా కాలిపోయినట్లు పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి రైతు ఆత్మహత్యాయత్నం

పామిడి: మండలంలోని దేవరపల్లికి చెందిన రైతు నక్కా ఓబులేసు తన పొలం తగాదా విషయంలో సోమవారం అర్ధరాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

ఆర్డీటీ సంస్థను పరిరక్షించాలి



రిలే నిరాహారదీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

అనంతపురం: ఆర్డీటీ సంస్థను పరిరక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలనే డిమాండ్‌తో మంగళవారం జిల్లా కోర్టులో న్యాయవాదులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదరికం, వెనుకబడిన వారి కోసం ఆర్డీటీ సంస్థ చేస్తున్న కృషిని వివరించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని కోరారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడు ఆలూరి రామిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్, జనరల్ సెక్రటరీ ఈ.వెంకట్రాముడు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు జి. ఉమాపతి, సీనియర్ న్యాయవాదులు చంద్రశేఖర్, పుల్లయ్య, అబ్దుల్ రసూల్, సాకే వెంకట్రాముడు, పద్మలత, ఐఏఎల్ జనరల్ సెక్రటరీ వేణుగోపాల్, రాజారెడ్డి, ఐలు రాష్ట్ర కమిటీ సభ్యులు సూర్యచంద్రయాదవ్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు తరిమెల గిరి తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడులు సాధించాలి



వేరుశనగ పంటపై అవగాహన కల్పిస్తున్న ఏఓ కృష్ణ చైతన్య

రాప్తాడు: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకుని తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలో బుక్కచెర్ల గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు నూతన పద్ధతులపై ఎప్పటికప్పుడు అవగాహన కలిగి పెట్టుబడులు తగ్గించుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి జీవన ఎరువులు వాడుకోవాలన్నారు. పంట నమోదును ఈ నెల 30లోపు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సుజిత, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీలోని కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఈఓ రామాంజనేయులు మంగళవారం తెలిపారు. ఉదయం 10గంటలకు జరుగనున్న హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమానికి ఆసక్తి గల వారు పంచ, టవాలుతో హాజరుకావాలన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి విరిగిన చెయ్యి

గార్లదిన్నె: మండలంంంలోని ఇల్లూరులో గ్రామస్తులు ఏర్పాటు చేసుకున్న అంబేడ్కర్ విగ్రహం చెయ్యి విరిగిన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం గ్రామస్తులు తెలిపిన వివరాలు మేరకు.. గ్రామంలో విద్యుత్ అధికారులు విద్యుత్ లైన్ ఏర్పాటు చేసే కార్యక్రమంలో భాగంగా ప్రొక్‌లెన్‌తో విద్యుత్ స్తంభం పైకి ఎత్తుతుండగా చెట్టు కొమ్మలు విరిగి పడడంతో అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలు విరిగింది. అలాగే కుడి చెయ్యి పూర్తిగా దెబ్బతింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల అంబేడ్కర్ విగ్రహం చెయ్యి విరిగిందని, కొత్త విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకుని కాంట్రాక్టర్లతో మాట్లాడారు. నూతన అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.